క్లుప్తంగా

పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి



ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు పూర్తి చేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మహిళలు

ఏలూరు (టూటౌన్): గత ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక రామచంద్రరావు పేటలో ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు పూర్తి చేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరకా శ్యామల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడు నెలలు పూర్తి కావస్తుందని, ఎన్నికల హామీ మేరకు పట్టణాలలో 2 సెంట్లు,గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గృహ నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిన కారణంగా నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అడారి మల్లీశ్వరి, దొడ్డి లక్ష్మమ్మ, మల్ల కోటేశ్వరి, పెంటకోటి ఉమా గౌరీ,మునకాల శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి



ఏలూరు సమన్వయకర్త జయప్రకాష్‌ను గజమాలతో సత్కరిస్తున్న ఏలూరు నగర ఎస్సీ సెల్ అధ్యక్షుడు జగదీష్

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పాలిట పెన్నిధిగా ఉంటూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి మేలు చేశారనీ, నేడు కూటమి సర్కారు పేదల జీవితాలతో చెలగాటం ఆడుతోందని వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ఏలూరు నగర ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన ఇనపనూరి జగదీష్ పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి సమన్వయకర్త జయప్రకాష్‌ను ఆదివారం గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. తనపై విశ్వాసంతో బాధ్యతలు అప్పగించిన ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు, ఏలూరు సమన్వయర్త జేపీ, నగర అధ్యక్షులు గుడిదేశి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు నెరుసు చిరంజీవి, నగర బీసీ సెల్ అధ్యక్షులు కిలాడి దుర్గారావు, జిల్లా ఆర్‌టీఐ అధ్యక్షులు స్టాలిన్‌బాబు, నగర మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండీ కైసర్ తదితరులు పాల్గొన్నారు.

అఖిల గాండ్ల తెలికుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ఏలూరు (టూటౌన్): అఖిల గాండ్ల తెలికుల కార్పొరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అంబటి గురుమూర్తి కోరారు. స్థానిక సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు గురుమూర్తి ఇంటి వద్ద ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గురుమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, దాని ద్వారా కుల వృత్తులు చేసుకుంటున్న వారికి ఆర్థిక సహాయం అందించి, వారికి ప్రభుత్వం పూర్తి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా జిల్లా మహిళా కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు.

బాలోత్సవం నిర్వహణ అభినందనీయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): బాలోత్సవం పిల్లల సంబరాలు పేరిట వేలాదిమంది విద్యార్థులను ఒకచోట చేర్చి, వారిలోని సృజనాత్మకతను, శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించే ప్రయత్నం చేయడం అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. శుక్ర, శనివారాల్లో స్థానిక సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలో నిర్వహించిన హేలాపురి బాలోత్సవం ఐదో పిల్లల సంబరాల్లో విజేతలకు ఆదివారం స్థానిక సీఆర్‌రెడ్డి కళాశాల ఆడిటోరియంలో బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సభకు బాలోత్సవ కమిటీ ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఈ బాలోత్సవంలో కొత్తవారిని భాగస్వాములను చేస్తున్నామన్నారు. 2019లో మొదటిసారిగా కేవలం 3,200 మంది విద్యా ర్థులతో ప్రారంభమైన ఈ బాలోత్సవం నేడు 14 వేల మందికి వేదిక అయ్యిందన్నారు. మొత్తం 69 అకడమిక్, కల్చరల్ అంశాల్లో కిడ్స్, సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్ కేటగిరీల్లో గెలుపొందిన 865 మంది విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఆహ్వాన సంఘం ఛైర్‌పర్సన్ అడుసుమిల్లి నిర్మల, ప్రధాన కార్యదర్శి డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంబరాలు

- వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలు
- వైభవంగా గణతంత్ర వేడుకలు
- ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో జెండా వందనాలు
- ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు

76వ గణతంత్ర వేడుకలను ఆదివారం అట్టహాసంగా జరుపుకున్నారు. త్యాగ మూర్తుల త్యాగాలను స్మరించుకున్నారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థల వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. గ్రామ సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాల వద్ద సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు త్రివర్ణ పతాకాలను ఆవిష్కరించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పతాకావిష్కరణ చేశారు.



గణపవరం మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పతాకావిష్కరణ



ఉంగుటూరు: నారాయణపురం డిగ్రీ కాలేజి వద్ద మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు

భీమడోలు: ఎందరో మహనీయుల త్యాగఫలమే ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలని, వారు దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, స్థానిక కార్యాలయం వద్ద తహసీల్దార్ బి.రమాదేవి జాతీయ జెండాకు గౌరవ వందనం చేసారు. భీమడోలు మానస ఇంగ్లీషు మీడియం పాఠశాలలో ప్రిన్సిపల్ యలమర్తి రవీంద్రకుమార్ ఆధ్వర్యంలో, భీమడోలు శాఖా గ్రంథాలయంలో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. గ్రంథాలయంలో నిర్వహించిన వేడుకలో సర్పంచ్ పాము సునీతామాన్ సింగ్, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ తదితరులు పాల్గొన్నారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్ పాల్గొని విద్యార్థులకు బహుమతులను అందించారు. పోలసానిపల్లి పంచాయతీ, ప్రభుత్వ పాఠశాలల వద్ద సర్పంచ్ షేక్ రహీమ జాతీయ జెండాను ఎగుర వేసారు. భీమడోలు గాంధీబొమ్మ సెంటర్ వద్ద మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యర్రంశెట్టి ఏడుకొండలు ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగుర వేసారు. నియోజకవర్గ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి సుబ్బారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. భీమడోలు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో త్రివర్ణ పతాకాన్ని జిల్లా శాంతి రథాల ఛైర్మన్ అప్పక రాంబాబు ఎగుర వేసారు. ఈ కార్యక్రమాల్లో ఎంఈవో 1, 2 ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కర్‌కుమార్, హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు, మండల కన్వీనర్ పంచకర్ల సత్యనారాయణ, మండల ఛైర్మన్ గుల్లా నూకరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

గణపవరం: స్థానిక మండల కార్యాలయం వద్ద ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ అప్పారావు, మండల వనరుల కేంద్రం వద్ద ఎంఈవో గొర్రెల బాలయ్య, తన కార్యాలయం వద్ద సీఐ సుభాష్, ప్రభుత్వ డిగ్రీ కాలేజిలో ప్రిన్సిపల్ నిర్మలకుమారి, గణపవరం వర్తక సంఘ భవనం వద్ద ఛైర్మన్ ఆర్‌వీఎస్ రాజు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. పిప్పర శాఖా గ్రంథాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గణపవరం బాలురు, బాలికలు ఉన్నత పాఠశాలలు, అర్ధవరం, పిప్పర, కేశవరం,కాశిపాడు జెడ్పీహెచ్‌ఎస్‌లలో గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పిప్పర పీహెచ్‌సీ వద్ద వైద్యాధికారిణి కె.ప్రియాంక జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ చదవాలి

ఉంగుటూరు: రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చదవాలని ఉంగుటూరు ఎంపీడీవో రాజ్‌మనోజ్ అన్నారు. ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎంపీడీవో ఆవిష్కరించారు. జాతీయ నాయకుల చిత్రపటాలకు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దారు కార్యాలయం వద్ద ఎమ్మార్వో పూర్ణచంద్రప్రసాదు, ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వద్ద డాక్టర్ శిరీష, పంచాయతీ ఆఫీసు వద్ద సర్పంచి బందారు సింధు, నారాయణపురం ఎస్‌వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు జాతీయ జెండాను ఎగుర వేశారు. జాతీయ జెండాను ఎగురవేశారు. టోల్ ప్లాజా వద్ద మేనేజరు ఇంతియాజ్ జాతీయ జెండాను ఎగుర వేశారు.

ఉత్సాహంగా వేడుకలు

దెందులూరు: దెందులూరు మండలంలో గణతంత్ర వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో, పోలీస్ స్టేషన్, ఎంఈఓ కార్యాలయాలు, పోస్ట్ ఆఫీసులు, విద్యుత్ సబ్‌స్టేషన్, బాలసదనం, నర్సింగ్ డీఈడీ కళాశాల, గోపన్నపాలెం పీఈటీ కళాశాలలో ఘనంగా నిర్వహించి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పెదవేగి సీఐ శ్రీనివాసరావు, దెందులూరు తహసీల్దార్, బి.సుమతి, ఎంపీడీవో కే శ్రీదేవి పాల్గొన్నారు.

ఉద్యోగులకు ప్రసంశా పత్రాలు

పెదపాడు: పెదపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి అధికారులు, ప్రజాప్రతినిధులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. విశేష కృషి చేసిన ఉద్యోగులకు మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రసంశా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో పెదపాడు మండల సర్వేయర్ కోదండరామ్, వీఆర్వోలు నర్సింహ, రాంబాబు, కోటేశ్వరరావు, నటరాజు, ప్రభాకరరావు పాల్గొన్నారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో పీ వెంకటేశ్వరావు, పెదపాడు పోలీసు స్టేషన్‌లో ఎస్సై కట్టా శారదా సతీష్, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో మహ్మద్ అమీల్ జమా జాతీయ జెండాను ఆవిష్కరించారు.

భోగాపురంలో వేడుకలు



భీమడోలు: ఎంపీడీవో కార్యాలయం వద్ద జెండాను ఎగురవేస్తున్న ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ



ఉంగుటూరు: మండల పరిషత్ కార్యాలయం వద్ద జెండా వందన చేస్తున్న ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఎంపీడీవో మనోజ్

పెదవేగి : భోగాపురం వద్ద నిర్మించిన భారీ పతాక స్తూపం వద్ద గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఏలూరు మండలం ఊరాయిగూడెంకు చెందిన సేవ ఫౌండేషన్‌కు చెందిన గోరింక వెంకటేశ్వరరావు తదితరులు ఆవిష్కరించారు. దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంత కళాశాలలో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. కరస్పాండెంట్, సెక్రటరీ ఫాదర్ జి మోజెస్, విద్యార్థులు పాల్గొన్నారు.



పెదపాడు: తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రశంసాపత్రాలు అందజేస్తున్న పెదపాడు తహసీల్దార్ కృష్ణ జ్యోతి



భీమడోలు: మానస స్కూల్లో వినూత్న తరహాలో పరేడ్ ఏర్పాటు చేసి గణతంత్ర ఉత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం



దెందులూరు: గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన తహసీల్దార్ సుమతి



పెదవేగి : భోగాపురంలో జాతీయ పతకాన్ని ఆవిష్కరించి భారతమాతకు జేజేలు పలుకుతున్న దృశ్యం

పశువులకు ఏలికపాము నివారణ మందు వేయాలి

గణపవరం: కొండేపాడులో ఆదివారం పశుఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ శీతాలం పుల్లయ్యనాయుడు ప్రారంభించారు. ఈసందర్భంగా గణపవరం పశుసంవర్ధక శాఖ ఏడీ డీఎం నాయక్ మాట్లాడుతూ పశువులకు పుట్టినప్పటి నుంచే ఏలిక పాము నివారణ మందు క్రమం తప్పకుండా వేయాలని, దీనివల్ల పశువులు సకాలంలో ఎదకు వస్తాయని వివరించారు. ఆవులు, గేదెలకు గర్భకోశ పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో వివిధ ఆరోగ్య సమస్యలపై తీసుకువచ్చిన 98 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి, పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.రైతులకు ఉచితంగా మినరల్ మిక్చర్ పంపిణీ చేశారు. ఈనెల 27న జల్లి కొమ్మరలో, 28న వాకపల్లిలో, 29న ముగ్గుళ్లలో, 30న కోమర్రులో పశువైద్యశిబిరాలు నిర్వహిస్తామని నాయక్ తెలిపారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ బి.నాగజ్యోతి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కొండేపాడులో మేకలకు నట్టల నివారణ మందు వేస్తున్న పశు వైద్యులు

విజేతలకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, బుజ్జిగోపాల్

దెందులూరు: ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులు విద్య, క్రీడల్లో రాణించాలని, దేశభక్తి కలిగి ఉండాలని గాలాయగూడెం సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత చిలకావెంకట సుబ్బారావు, దాత మండూరు బుజ్జి గోపాల్ అన్నారు. గణతంత్ర వేడుకల సందర్భంగా జూనియర్ సీనియర్ విభాగాల్లో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, క్రీడలు పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కోటదిబ్బ దర్గా ఉరుసు ఉత్సవాలు ప్రారంభం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని కోటదిబ్బపై ఉన్న హజరత్ సయ్యద్ బాయజీద్ మహాత్ముల దర్గాలో మహాత్ముని ఉరుసు ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉరుసు ఉత్సవాల్లో భాగంగా ఉదయం జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం దర్గాలో దివ్య ఖుర్‌ఆన్ గ్రంథపఠనం చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాత్రి 10.30 గంటలకు స్థానిక గడియార స్థంభం ప్రాంతంలోని జీనత్ మంజిల్ నుంచి గంధం కలశ ఊరేగింపు ప్రారంభమైంది. దర్గా వద్ద ఏర్పాటు చేసిన గుమ్మటం భక్తులకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

ఉత్తమ సమాజ స్థాపనలో భాగస్వాములు కావాలి

భీమడోలు: ఉత్తమ సమాజ స్థాపన లక్ష్యంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పని చేస్తుందని జిల్లా శాంతిరథాల కమిటీ ఛైర్మన్ అప్పక రాంబాబు అన్నారు. పోలసానిపల్లి - 2 ప్రాథమిక పాఠశాలలో ఆదివారం మండల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల సాధారణ సమావేశం జరిగింది. మండల ఛైర్మన్ గుల్ల నూకరాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు అప్పక రాంబాబు, సర్పంచ్ షేక్ రహీమ తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనారోగ్యం కారణంగా ఆపరేషన్ చేయించుకున్న పోలసానిపల్లి పంచాయతీ గుమస్తా వెంకట రమణకు మానవత సంస్థ అందించిన రూ.3వేల ఆర్థిక సాయాన్ని సర్పంచ్ చేతుల మీదుగా అందజేసారు. మానవత సంస్థకు మూడవ ఫ్రీజర్ కొనుగోలు చేసేందుకు సర్పంచ్ రహీమ తన అత్తా మామలు షేక్ సమీమున్నీసా, కరీముల్లాల జ్ఞాపకార్థం రూ.10వేల విరాళంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రామిశెట్టి గంగాధరరావు, గుల్ల అప్పారావు, గోనుగుంట రమణశంకర్, గుడివాడ సీతారామాంజనేయులు, గంధం వెంకట్రావు, చిలపర్తి రామానాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డుపై హర్షం

దెందులూరు: ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణకు అలుపెరగని పోరాటాలు చేసిన మందకృష్ణ మాదిగకు భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును ప్రకటించడం ఎంఆర్‌పీఎస్ పోరాటానికి గుర్తింపు, గౌరవంగా భావిస్తున్నామని ఎంఆర్‌పీఎస్ నాయకులు అన్నారు. జాతీయ, రాష్ట్ర నాయకులు పొలిమేర హరికృష్ణ, బయ్యారపు రాజేశ్వరరావు, తనగల శేఖర్, ఎర్ర నాగమల్లేశ్వరరావు, గొట్టేటి స్టాలిన్, కొత్తపల్లి మురళి ఆదివారం గంగన్నగూడెంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబాటు తనానికి గురయ్యారని అన్నారు. మంద కృష్ణ మాదిగతో పాటు పోరాటం చేసిన మాదిగ కులస్తులందరికీ పద్మశ్రీ పురస్కారం అంకితమవుతుందన్నారు. ఎంఆర్‌పీఎస్ పోరాటంలో అసువులు బాసిన మాదిగ సోదరులందరూ చిరస్మరణీయులన్నారు. మంద కృష్ణ మాదిగ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకోవాలని, మాదికులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగేంత వరకు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

పొంచి ఉంది.. మంచు ముప్పే



పొలాలను కప్పేసిన మంచు దుప్పటి



మంచులోనే పొలం పనులు చేసుకుంటున్న రైతులు

గణపవరం: కొన్ని రోజులుగా పొగమంచు జనజీవనాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. తెల్లవారుజాము 3 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకూ మంచు విపరీతంగా కురుస్తోంది. రాత్రి వేళల్లో 6 గంటలకే చలిగాలులు ప్రారంభమై తెల్లవార్లు విపరీతమైన చలి వేధిస్తోంది. మంచు, చలి కారణంగా శ్వాసకోస, జలుబు, దగ్గు, ఆయాసం తదితర సమస్యలతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అనారోగ్య సమస్యలతో క్లినికల్ లేబొరేటరీలు, ఆస్పత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ సతమతమవుతున్నారు. ఈమంచు సమస్య ప్రజలందరినీ వేధిస్తున్నా, ముఖ్యంగా ఆరోగ్యం కోసం ఆరుబయట, తెల్లవారు జామున, రాత్రి వేళల్లోను వ్యాయామాలు, వాకింగ్, రన్నింగ్, ఇతర కసరత్తులు చేసేవారు ఈ పొగమంచు ప్రభావానికి ఎక్కువగా గురవుతున్నారు. ఉదయాన్నే కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, పొలం పనులకు వెళ్లే రైతులు, కూలీలు, చిరు వ్యాపారులు మంచు ప్రభావానికి గురవుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు వచ్చే రోగుల్లో శ్వాసకోశ వ్యాధులతో వచ్చేవారే అధికంగా ఉంటున్నారు. ముఖ్యంగా ఆస్తమా, అలర్జీ ఉన్నవారు కాస్త ఎండ వచ్చాక బయటకు రావడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. పగటి ఉష్ణోగ్రతలు తగ్గిపోవడం వల్ల మధ్యాహ్నం వేళల్లోనూ చలి ఎక్కువగా ఉంటోంది.



మంచులో నడక వ్యాయామం చేస్తున్న యువతి



మంచులోనే కళాశాలకు వెళ్తున్న విద్యార్థినులు

వాతావరణ మార్పులతో ఇబ్బందే

కొద్ది రోజులుగా వాతావరణంలో అనూహ్యంగా పెరిగిన మార్పులు ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బంది పడేవారి సంఖ్య పెరుగుతోంది. ఈవాతావరణంలో శ్వాసకోశ, గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉంది. పొగమంచు దట్టంగా కురుస్తున్న సమయంలో ఇంటి ఆవరణలో పనులు చేసుకోవాలనుకున్నా తలకు ముఖ్యంగా చెవులకు అడ్డుగా వస్త్రాన్ని చుట్టుకోవడం మంచిది. ఉదయాన్నే కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, పొలం పనులకు వెళ్లే రైతులు, కూలీలు కూడా ఈ జాగ్రత్తలు తీసుకోవాలి. గర్భిణులు, బాలింతలు, ఇతర వ్యాధిగ్రస్తులు చలిగాలికి దూరంగా ఉండాలి. – పులపర్తి సంతోష్, పీహెచ్‌సీ వైద్యాధికారి, గణపవరం

ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి

శీతాకాలంలో వేకువజామునే వ్యాయామం, నడక, పరుగు, క్రీడాసాధన చేసేవారు, పొలం పనులకు వెళ్లే రైతులు, కూలీలు, కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి. ఉన్ని దుస్తులు, కాటన్ దుస్తులు వంటివి ముఖానికి కప్పుకోవాలి. వయోధికులు, మహిళలు మంకీ క్యాప్, కాళ్లకు, చేతులకు పూర్తిగా కప్పిఉంచే దుస్తులు, బూట్లు ధరిస్తే మంచిది. రోగులు, వృద్ధులకు ఇండోర్ వ్యాయామాలు ఆరోగ్యానికి మంచిది.

గణతంత్ర వేడుకల్లో జెస్సీకి అరుదైన గౌరవం

ఐసీడీఎస్ శకటంపై జెస్సీ ఫొటో ప్రదర్శన

దెందులూరు: భారతగణతంత్ర వేడుకల సందర్భంగా ఆదివారం మంగళగిరిలో నిర్వహించిన శకటాల ప్రదర్శనలో ఏలూరు జిల్లా జోగన్నపాలెంకు చెందిన ఇంటర్నేషనల్ స్కేటర్ ప్రధానమంత్రి అవార్డు గ్రహీత జెస్సీకి అరుదైన గౌరవం, గుర్తింపు దక్కింది. ఈ వేడుకల్లో భాగంగా అభివృద్ధిని ప్రతిబింబించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం శకటాల ప్రదర్శన నిర్వహించింది. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రదర్శించిన శకటంపై జెస్సీ భారత రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు తీసుకున్న ఫొటోను ముద్రించారు. 2025 ప్రధానమంత్రి బాల పురస్కార్ అవార్డు, రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒక్క జెస్సీకే రావడం విశేషం. జోగన్నపాలెం గ్రామస్తులు జెస్సీ కుటుంబ సభ్యులు బంధువులు క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర, జాతీయస్థాయిలో జోగన్నపాలెంకు జెస్సీ గుర్తింపు తీసుకువచ్చిందని స్థానికులు ప్రశంసించారు.



మంగళగిరిలో గణతంత్ర వేడుకల్లో ఐసీడీఎస్ ప్రదర్శించబడిన శకటం. రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న జెస్సీ ఫొటో (ఇన్‌సెట్)

యథేచ్ఛగా మాంసం విక్రయాలు

భీమడోలు: రిపబ్లిక్ డే సందర్భంగా మాంసపు దుకాణాలు మూసి వేయాలన్న ఆదేశాలున్నా మండల వ్యాప్తంగా యథేచ్ఛగా విక్రయాలు కొనసాగాయి. ఆదివారం కావడంతో ప్రజలు భారీగా కొనుగోలుకు తరలివచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం, గాంధీ జయంతి రోజుల్లో మాంసపు విక్రయాలు, మద్యం విక్రయాలకు సెలవు ప్రకటిస్తారు. ఆయా రోజుల్లో మాంసపు వినియోగాన్ని నిషేధిస్తూ ప్రభుత్వాలు ఆదేశాలిచ్చాయి. ఈ ఆదేశాలను భేఖాతరు చేస్తూ వ్యాపారులు మాంసపు విక్రయాలు కొనసాగించడంపై విమర్శలు వస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపించడంతో మండల వ్యాప్తంగా కోడి, వేట మాంసపు దుకాణాలు జనంతో కిటకిటలాడాయి. భీమడోలు, గుండుగొలను, పూళ్ల తదితర గ్రామాల్లో మాంసం విక్రయాలు కొనసాగాయి. మద్యాన్ని సైతం కొందరు రహస్యంగా విక్రయించినట్లు సమాచారం.



భీమడోలు దుకాణంలో మాంసం విక్రయాలు